సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర

31న చలో ఢిల్లీ సన్నాహక సదస్సు

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ ఈనెల 31న చేపట్టనున్న సన్నాహక సదస్సును జయప్రదం చేయాలని సిఐటియు, రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల కార్యదర్శులు ఎస్.నాగేంద్రకుమార్, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి, ఎం.బాలరంగయ్య, ఎం.క్రిష్ణమూర్తి పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక ఎన్జీఓ హోంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ కార్మిక రైతు కూలీలు, కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు సిఐటియు, రైతు, కౌలు రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఏప్రిల్ 5వ తేదీన చేపడుతున్న ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కేంద్రంలోని మోదీ ప్రబుత్వం కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. రాష్ట్రానికి ఇచ్చిన హామీలు అమలు చేయకుండా వివక్ష చూపుతోందన్నారు. రాయలసీమ రైతాంగానికి వంద శాతం సబ్సిడీతో డ్రిప్పు, స్ప్రింకర్లు, హంద్రీనీవాకు బడ్జెట్లో నిధులు కేటాయించాలని, సాగునీరు ఆయకట్టు కేటాయించాలని, పంటల బీమాను ప్రభుత్వ రంగంలోనే ఉండాలని, బ్యాంకుల ప్రయిటీకరణ ఆపాలని, పార్లమెంట్‌లో ఋణ మాఫీ చట్టం తీసుకురావాలని, పంటలకు మద్దతు ధర చట్టం చేయాలని, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని తదితర డిమాండ్‌లతో ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 31న నిర్వహించే సదస్సుకు అన్ని వర్గాల వారు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు అధ్యక్షురాలు ఎం.నాగమణి, జిల్లా నాయకులు వెంకటనారాయణ పాల్గొన్నారు.

ముగిసిన అనంత బాలోత్సవం

ఆటలు, పాటలు, జానపద నాటికలు, కోలాటం, నృత్యాలు, సంగీతం, సాహిత్యం, వక్తృత్వం, వార్తా కథనం, మట్టి బొమ్మలు తదితర వాటితో చిన్నారుల అనంత బాలోత్సవం కనుల పండువగా, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మది మురిసిపోయేలా ఆర్ట్స్ కళాశాల ఎగ్జిబిషన్ మైదానం కళకళలాడింది. మూడు రోజుల పాటు ఉత్తేజ పూరితమైన వాతావరణంలో పిల్లల సృజనాత్మకత, సామాజిక చైతన్యం, సంస్కృతి, సంప్రదాయాలు మేళవింపుగా.. ఉత్తేజభరితంగా సాగిన అనంత బాలోత్సవాలు ఆదివారం విజయవంతంగా ముగిశాయి. పిల్లల ఉత్సాహానికి తల్లిదండ్రుల ప్రోత్సాహం, ఉపాధ్యాయుల నైపుణ్యత కలగలసి పిల్లల పండుగ నిండుతనంగా కొనసాగింది. అతిథుల కరచాల ధ్వనుల నడుమ చిన్నారుల ప్రశంసల జల్లులు వెల్లువెత్తాయి. ఇంతటి చక్కటి వేదికను ఏర్పాటు చేసి పిల్లల్లో ఆనందాన్ని నింపిన అనంత బాలోత్సవం కమిటీ నిర్వాహకులకు, సహకరించిన అధికారులకు ప్రజల నుంచి అభినందలు వెల్లువెత్తాయి

ఉత్సాహం, ఉల్లాసంతో మెరిసిన చిన్నారులు

మురిసిపోయిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు

కనులవిందుగా సాగిన కళా ప్రదర్శనలు

విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

విభిన్న కళల ఆవిష్కరణలు, ప్రదర్శన చతురత, కుటుంబ బాంధవ్యాలు, వృద్ధాప్య తల్లిదండ్రుల సంరక్షణ, బాల్య వివాహాల నిర్మూలన, సమాజిక స్పృహ, ఒకటేమిటి చిన్నారులతో ఉత్తేజభరితంగా మూడు రోజుల పాటు సాగిన అనంత బాలోత్సవం ఆదివారం ముగిసింది. ఒకరిని మించి మరొకరు పోటా పోటీగా ప్రదర్శనలు, బృంద నృత్యాలు, జానపద నాటికలు, ఏకపాత్రాభినయం, విచిత్ర వేషధారణ, జాతీయ నేతల ధైర్య సాహసాలు, త్యాగం, గొప్ప వ్యక్తుల సేవాదృక్పథాలు, రైతుల స్థితిగతులు, పర్యావరణ పరిరక్షణకు మొక్కల సంరక్షణ, తీరకలేని దైనందిన జీవితంలో వాహనాలు నడిపేటప్పుడు జాగ్రత్తలు, సాంకేతిక పరిజ్ఞానం మంచి కోసం వినియోగించాలంటూ పిల్లలు ప్రదర్శనలు న్యాయనిర్ణేతలకే ఆనందాన్ని పంచాయి.

పిల్లల ఆసక్తిని గురించి ప్రోత్సహిద్దాం
అనంతపురం డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి

పిల్లలకు ఇష్టంలేని చదువులు చదివించి వారిని బాధపెట్టి మనం బాధపడటం కన్నా వారికి పై చదువుల్లో సైన్స్, ఆర్ట్స్, ఇంజనీరింగ్, వృత్తివిద్య, వంటి వాటిలో ఏది ఇష్టమో వారి ఆసక్తిని గుర్తించి అటువైపు ప్రోత్సహించేలా తల్లిదండ్రులు బాధ్యత వహించాలని అనంతపురం డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆర్ట్స్ కళాశాల ఎగ్జిబిషన్ మైదానంలో మూడు రోజుల పాటు నిర్వహించిన అనంత బాలోత్సవాలు ముగిశాయి. పోటీల్లో పాల్గొన్న విజేతలకు బహుమతుల ప్రధాన కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు సూర్యచంద్రయాదవ్ ఆహ్వానితులుగా, అనంత బాలోత్సవ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి వి.సావిత్రి అధ్యక్షతన ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి, కేంద్ర సాహిత్య అకాడమీ శాశ్వత సభ్యులు ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, ప్రముఖ కంటి వైద్యులు అక్బర్ సాహెబ్, మూడవ పట్టణ పోలీస్‌స్టేషన్ సిఐ కత్తి శ్రీనివాసులు, రవికాంత్ క్యాటర్స్ అధినేత రమణ, లలితకళాపరిషత్ అధ్యక్షులు వెంకట సుబ్బయ్య, కార్యదర్శి, ప్రముఖ న్యాయవాది పద్మజ, నాట్యాచార్యులు పట్నం శివప్రసాద్, డాక్టర్ హేమలత, సాయి సంస్థ విజయకుమార్ తదితరులు హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ పిల్లలకు చదువుతో పాటు ఆటలు, నైపుణ్య కళలు అవసరం అన్నారు. చదువులో రాణించకపోయినా ఆటలు, పాటలు, సంగీతం, వివిధ కళలతో ఆదర్శంగా నిలిచిన వారెందరో ఉన్నారని తెలిపారు. 130 కోట్ల జనాభా కలిగిన భారతదేశం కంటే కోటి మంది కూడా లేని ఇజ్రాయిల్ దేశంలో నొబెల్ బహుమతులు సాధిస్తున్నారంటే వారు చదువుకున్న వారు మాత్రమే కాదని అనేక కళలతో ప్రతిభ చాటుతున్నారని గుర్తు చేశారు. తల్లిదండ్రులు తమ పిలల్ని డాక్టర్, ఇంజనీర్‌గా చూడాలన్న ఆశయాలను బలవంతంగా రుద్ది బాధపడే కన్నా వారికి నచ్చిన రంగాన్ని గుర్తించి అటువైపు ప్రోత్సహించాలని సూచించారు. ఆర్ట్స్ గ్రూపు చదువుకున్న వారే అత్యధికంగా అత్యున్నత స్థానాల్లో నిలిచారన్నారు. అనంత బాలోత్సవంలో పిల్లల సృజనాత్మకత చూస్తుంటే ఆనందంగా ఉందన్నారు. కేంద్ర అకాడమీ అవార్డు గ్రహీత రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ మూడు రోజుల పాటు పిల్లలు టివీలు, సెల్‌ఫోన్‌లకు దూరమై అనంత బాలోత్సవంలో సృజనాత్మకత, తమ కళా ప్రదర్శనలతో అసలైన ఆనందాన్ని పొందడం సంతోషంగా ఉందన్నారు. పిల్లలు యాంత్రిక నాగరికతకు లోనవుతున్నారని తెలిపారు. టివి, సెల్‌ఫోన్, కంప్యూటర్ మంచి యాంత్రికరణలే అని, వాటిలో మంచిని మాత్రమే స్వీకరించి చెడుకు దూరంగా ఉండాలన్నారు. విద్యా కార్పొరేటీకరణ జరిగిన నేపథ్యంలో పిల్లలకు ఆటలు, పాటలు దూరమయ్యాయన్నారు. అనంత బాలోత్సవం ఆ లోటును భర్తీ చేసి పిల్లల్లో మంచి ఆలోచనలను పెంపొందించాయని తెలిపారు. అనంత బాలోత్సవ కమిటీ అధ్యక్షురాలు షమీమ్ షఫీవుల్లా మాట్లాడుతూ అనంత బాలోత్సవంలో పిల్లలు మూడు రోజుల పాటు ఎంతో ఆనందంగా తమ కళలు, ఆలోచనలు, ప్రదర్శనలు చేస్తూ గడపడం సంతోషంగా ఉందన్నారు. అనంత బాలోత్సవ కమిటీ కార్యనిర్వాహక కార్యదర్శి సావిత్రి మాట్లాడుతూ అనంత బాలోత్సవం విజయవంతంగా నిర్వహించడానికి సహకరించిన ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ దివాకర్‌రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి కృష్ణయ్య, ఇతర అధికారులు, పిల్లల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సహాయ సహకారాలు అందించిన దాతలు, నిర్వాహక కమిటీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రచయితలు కంబదూరి షేక్ నబీరసూల్, నానీల నాగేంద్ర, రియాజుద్దీన్, మధురశ్రీ, ఎల్ఆర్.రమణ, సాదుశేఖర్, అంకె శ్రీనివాసులు, అనంత బాలోత్సవ కమిటీ కార్యదర్శి శ్రీనివాసరావు, కోశాధికారి జిలాన్, సభ్యులు కోటేశ్వరప్ప, రమణయ్య, నాగేంద్ర, లింగమయ్య, గోవిందరాజులు, సరళ, దేవేంద్రమ్మ, పరమేష్, గిరి, శివ, రిషి, రామాంజినమ్మ, హసీనా, చంద్రిక, సురేష్, రాము, నాగేంద్రకుమార్, రామిరెడ్డి, ఆర్‌వి.నాయుడు, నాగమణి, క్రిష్ణమూర్తి, వెంకటనారాయణ, బాల రంగయ్య, నల్లప్ప, రాంభూపాల్, యోగా గురువు క్రిష్ణవేణి, మానవతా తరిమెల అమర్‌నాథ్‌రెడ్డి, వన్నూరు మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న డీఎస్పీ ప్రసాద్‌రెడ్డి

చిన్ని కృష్ణుడితో నృత్యం చేస్తున్న గోపికలు

మహిళలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి

డాక్టర్ నానీల నాగేంద్రకు రాష్ట్రస్థాయి పురస్కారం

ప్రజాశక్తి-అనంతపురం

శ్రీ కృష్ణదేవరాయ విద్యాలయం తెలుగు తులనాత్మక సాహిత్య శాఖలో అకాడమిక్ కన్సల్టెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ నానీల నాగేంద్ర పిహెచ్‌డి సిద్ధాంత గ్రంథం రాష్ట్రస్థాయి కొలకలూరి రామయ్య పరిశోధన పురస్కారం-2023 కు ఎంపికయింది. నాగేంద్ర శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తి మండలం పెడపల్లి గ్రామంలో ఈరమ్మ, చిన్న గరుడప్ప దంపతులకు జన్మించారు. దళిత కుటుంబంలో పుట్టి అంచెలంచెలుగా ఎదుగుతున్న నాగేంద్ర ఎందరికో ఆదర్శంగా నిలిచారు. అనంతపురం జిల్లా నుండి నానీల నాగేంద్రగా అందరికీ సుపరిచితుడు. జాతీయ అంతర్జాతీయ సెమినార్లలో పాల్గొని దాదాపు 50 పరిశోధనా పత్రాలను సమర్పించారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం జిల్లా శాఖకు ప్రధాన కార్యదర్శిగా ఉంటూ నిరంతరం సాహితీ కార్యక్రమాలు నిర్వహిస్తూ చురుకైన పాత్రను నిర్వహిస్తున్నారు. ఈ పురస్కారం రావడం పట్ల ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ప్రధాన ఆచార్యులు ఆచార్య జి.బాలసుబ్రమణ్యం, సౌరపు గోవిందరాజులు, బి.ఈశ్వర్‌రెడ్డి, పూజారి ఈరన్న, నందవరం కేశవరెడ్డి, కేంద్రీయ విశ్వవిద్యాలయం హైదరాబాద్ తెలుగు శాఖ అధ్యక్షులు ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు తదితరులు నానీల నాగేంద్రను అభినందించారు.

నగరంలో అధ్వానంగా రోడ్లు

మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

నగరంలో ఎక్కడ చూసిన రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్‌చౌదరి విమర్శించారు. ఆదివారం 49వ డివిజన్ ఇందిరా గాంధీ నగర్‌లో మాజీ శాసనసభ్యులు ప్రభాకర్ చౌదరి పర్యటించారు. పెద్ద ఎత్తున ప్రజలు హాజరై తమ సమస్యలను వినిపించారు. ఇదేం కర్మ రాష్ట్రానికి అంటూ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. పెన్షన్లు కావాలని, ఇల్లు కావాలని, ఇంటి స్థలం ఇప్పించాలని, ఉన్న పెన్షన్ కూడా తొలగించారని, నూతనంగా పెన్షన్లు ఇవ్వడం లేదని ఇలా ప్రజలు తమ సమస్యలను వివరించారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే నగరం మంతా గుంతలు లేకుండా తారురోడ్లు వేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షుడు మారుతీకుమార్ గౌడ్, మాజీ డిప్యూటీ మేయర్ గంపన్న, దేవర్ల మురళి, జిల్లా ఉపాధ్యక్షుడు డిష్ నాగరాజు, జిల్లా అధికార ప్రతినిధిలు సరిపూటి రమణ, నారాయణస్వామి యాదవ్, జిల్లా మైనారిటీ అధ్యక్షుడు సాలార్‌బాషా, స్వామిదాస్, లక్ష్మీప్రసాద్, శ్రీధర్, వెంకటనారాయణ, మహిళా అధ్యక్షురాలు విజయశ్రీరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి

కార్మిక శాఖ అనంతపురం జిల్లా ఇన్‌ఛార్జి డిసిఎల్ రఘురాములు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, కార్మికుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వాలు అమలుచేస్తున్న పథకాలు, ఫలాలు అందించడమే తమ లక్ష్యమని అనంతపురం జిల్లా కార్మిక శాఖ ఇన్‌ఛార్జి కమిషనర్ జి.రఘురాములు అన్నారు. జిల్లాలో కార్మికుల కోసం చేపడుతున్న చర్యలు, అందిస్తున్న సేవలపై ప్రజాశక్తితో ఆయన ముఖాముఖి ముచ్చటించారు. ఆ వివరాలు ఇలా..

ప్రశ్న : జిల్లాలో ఎన్ని పరిశ్రమలు ఉన్నాయి . కార్మికుల పరిస్థితి ఎలా ఉంది ?

జవాబు : జిల్లాలో 500 పైబడి పరిశ్రమలు ఉన్నాయి. కొన్ని పరిశ్రమలు మూత పడ్డాయి. పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు ఏదైనా సమస్య తలెత్తితే కార్మిక శాఖకు ఫిర్యాదు చేస్తారు. ఆ ఫిర్యాదు మేరకు తమ శాఖ అధికారులు పరిశీలించి సమస్య ఉందని తెలిస్తే సంబంధిత పరిశ్రమ యాజమాన్యంతో మాట్లాడి పరిష్కరిస్తాం. యజమాన్యం కార్మికులకు అన్యాయం చేస్తూ ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే న్యాయశాఖను ఆశ్రయించి కార్మికులకు న్యాయం జరిగేంత వరకు పని చేస్తాం.

ప్రశ్న : పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు చర్యలు చేపడుతున్నారా?

జవాబు : జిల్లాలో పలు పరిశ్రమల్లో ప్రమాదం సంభవించిన మాట వాస్తవమే. ప్రమాదం సంభవించినది సంబంధిత యాజమాన్య నిర్వహణ లోపం, అజాగ్రత్త వల్లే అని నిరూపణ అయితే బాధిత కార్మికులకు పరిహారం ఇప్పించడం, ప్రభుత్వం నుంచి వారి కుటుంబాన్ని ఆదుకోవడం వంటి చర్యలు చేపడుతున్నాం. యజమానులు పరిశ్రమ నిర్వహణకు అన్ని అనుమతులు తీసుకున్న తరువాతనే ఏర్పాటు చేస్తున్నారు. భద్రతా చర్యలు ఉంటేనే ప్రభుత్వం అనుమతి ఉంటుంది. మధ్యలో ఏదైనా ప్రమాదం ఏర్పడితే యాజమాన్యం బాధ్యత తీసుకోవాలి. బాధితుల పక్షాన తమ శాఖ పని చేస్తుంది.

ప్రశ్న : కార్మికుల శ్రమ దోపిడీ చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఏమంటారు?

జవాబు : యజమాని పరిశ్రమ పెట్టినప్పుడు లాభాల్లో నడవాలి. పరిశ్రమలో పనిని బట్టి కార్మికులను నియమిస్తారు. చేరేటప్పుడే వేతనం ఎంత ఇస్తారో స్పష్టమైన హామీతోనే చేరుతున్నారు. పెరుగుతున్న నిత్యావసర ధరలకు అనుగుణంగా కార్మికులకు వారు ఇచ్చే వేతనాలు పెంపుదల చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వ రంగ సంస్థల్లో అది తూచా తప్పకుండా అమలవుతుంది. ప్రయివేటు పరిశ్రమల్లో మా అజమాయిషీ ఉండదు. వారి పనిని బట్టి యజమానులే వేతనాలు నిర్ణయిస్తారు. 10 మంది చేయాల్సిన పనిని ఐదుగురితో చేయించి ఇబ్బందులు పెడితే తప్పకుండా యాజమాన్యం తప్పే. అలాంటి ఫిర్యాదులు వస్తే పరిశీలన చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.



ప్రశ్న : కార్మికులను తొలగిస్తే ఎలాంటి చర్యలు తీసుకుంటారు ?

జవాబు : యజమాని పరిశ్రమ మూత వేస్తున్నప్పుడు కార్మికులను తొలగిస్తే ఎవరూ ఏమీ చేయలేరు. పరిశ్రమ నిర్వహిస్తూనే ఎలాంటి తప్పూ లేకుండా తొలగించారన్న ఫిర్యాదు చేస్తే పరిశీలించి కార్మికులకు న్యాయం జరిగేలా చూస్తున్నాం. నిబంధనలు అతిక్రమించి ఏదైనా పొరపాట్లు చేశారన్న కారణంతో యాజమాన్యం కార్మికులను తొలగిస్తే కూడా ఏమీ చేయలేం. అలాంటి ఫిర్యాదులను పరిశీలన చేసి కార్మికుల తప్పిదం జరిగితే తిరిగి పనిలో చేర్చలేం.

ప్రశ్న : యాజమానులకు అధికారులు అనుకూలంగా ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి..మీ సమాధానం ?

జవాబు : జిల్లాలో కొత్త పరిశ్రమలు రావాలి. అప్పుడే కొత్తగా కార్మికులకు పని లభిస్తుంది. పరిశ్రమలను ప్రభుత్వం స్వాగతిస్తోంది. సరళీకరణ విధానం కార్మిక చట్టాల్లో కూడా జరిగింది. ప్రభుత్వ పాలకులు చేసిన చట్టాలను అధికారులమైన తాము అమలుచేయాల్సిందే. వ్యాపారం అభివృద్ధి జరిగినప్పుడే కొత్త పరిశ్రమలు వస్తాయి. యజమానులకు తమ శాఖ ద్వారా ఇవ్వాల్సిన అన్ని అనుమతులూ ఇస్తాం. అంతమాత్రాన యజమానులకు అనుకూలంగా పనిచేసినట్టు కాదు కదా. విరివిగా ఉపాధి కల్పించడం ప్రభుత్వ లక్ష్యం. చిన్న చిన్న పొరపాట్లు యాజమాన్యం చేస్తే సరిచేసి సక్రమంగా నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది.

ప్రశ్న : కార్మికుల సంక్షేమం అమలవుతోందా..?

జవాబు : భవన నిర్మాణ రంగ కార్మికులకు శాఖ తరుపున వివాహ ప్రోత్సాహకాలు, ప్రసూతి సహాయం, ప్రమాదం జరిగితే ఎక్స్‌గ్రేషియా తదితరాలు ఇస్తాం. సాధారణ మృతికి రూ.60 వేలు, దహన సంస్కారాలకు రూ.20 వేలు, ప్రమాదవశాత్తు మృతి చెందితే రూ.2 లక్షలు, అంగవైకల్యానికి రూ.2 లక్షలు ఇలా ప్రోత్సాహకాలు, సహాయక చర్యలు ఉన్నాయి. అయితే శాఖ నుంచి ఇచ్చే ప్రోత్సాహకాల కంటే రాష్ట్ర ప్రభుత్వం ఆయా కులాల వారీగా ఇస్తున్న సదుపాయాలు ఎక్కువగా ఉన్నాయి. లబ్ధిదారుడు ఎక్కడో ఒక శాఖ ద్వారా మాత్రమే తీసుకోవాలి. కార్మిక శాఖ కంటే విద్యా, వైద్యం, ప్రమాద బీమా రంగాల నుంచి అధిక ప్రోత్సాహం ఇస్తున్నప్పుడు అక్కడే తీసుకుంటున్నారు. మా శాఖ తరపున ఇవ్వాల్సినవి ఇతర శాఖలకు బదలాయింపు చేశారు. అనుమతులు కూడా ఆన్‌లైన్ మీసేవ ద్వారా పొందుతున్నారు. గతంలో పర్యవేక్షణ తమ శాఖ పరిధిలో ఉండేది. అనేక మార్పులు జరిగిన తరువాత ఇతర శాఖలకు కొన్ని బాధ్యతలు అప్పగించారు. సమిష్టిగా అందరూ కార్మికుల సంక్షేమానికే పనిచేస్తాం. చిన్న షాపులు, సంస్థలు సెల్ఫ్ డిక్లరేషన్ ద్వారా ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకుని నిర్వహించుకుంటున్నారు. ప్రభుత్వం కావాలని వెసులుబాటు కల్పించింది. వాటిని అందరూ పాటించాల్సిందే.

అక్రమ అడ్మిషన్‌లు అరికట్టాలని వినతి

డిఇఓకు వినతిపత్రం సమర్పిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

అనంతపురం కలెక్టరేట్

: అనంతపురం నగరంలో విద్యా సంవత్సరం ప్రారంభానికి ఆరు నెలల సమయం ఉన్నప్పటికీ కార్పొరేట్ విద్యాసంస్థల్లో అడ్మిషన్లు చేస్తున్నారని, అక్రమ అడ్మిషన్‌లు అరికట్టాలని ఐక్య విద్యార్థి సంఘాల నాయకులు పృధ్వీ, సురేష్, వినోద్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈమేరకు ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో డిఇఓ కృష్ణయ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నిత్యం కరువు కాటకాలకు నిలయమన అనంతపురం జిల్లాలో కార్పొరేట్ విద్యా సంస్థలు అక్రమ అడ్మిషన్‌లు చేస్తూ, అధిక ఫీజులు విద్యార్థుల తల్లి తండ్రుల నుంచి దండుకుంటున్నారని తెలిపారు. జనవరిలో చెరితె ఒక్క ఫిజు ఫిబ్రవరిలో అడ్మిషన్ చేస్తే ఒక ఫీజులుంటాయంటూ మాయ మాటలు చెప్పి ముందస్తుగా అడ్మిషన్లు చేస్తున్నారని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి కార్పొరేట్ విద్యాసంస్థలలో అడ్మిషన్లు చేస్తున్న వాటిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. నగరంలో నారాయణ, చైత్యన, భాష్యం, మాంటిసోరి, రఘు సైనిక్, ఇంకా జిల్లాలో ఉన్న తదితర కార్పొరేట్ విద్యాసంస్థలు ముందస్తు అడ్మిషన్లు చేస్తున్నారని ఆరోపించారు. విచారన చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రజాశక్తి
www.prajasakti.com

బాధితులకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-ఉరవకొండ

ఉరవకొండ, విడపనకల్లు మండలాల్లోని పలువురు లబ్ధిదారులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను నియోజకవర్గ ఇన్‌ఛార్జి వై.విశ్వేశ్వరరెడ్డి ఆదివారం పట్టణంలోని ఆయన నివాసంలో పంపిణీ చేశారు. ఉరవకొండ మండలం ఆమిద్యాల గ్రామానికి చెందిన నాగమ్మకు రూ.35 వేలు, ఉరవకొండకు చెందిన ఒగ్గు గోవిందుకు రూ.15వేలు, విడపనకల్లు మండలం కొట్టాలపల్లి గ్రామానికి చెందిన మోదుపల్లి ఎర్రమ్మకు రూ.32వేల చెక్కులను ఆయా లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో విడపనకల్లు జెడ్పిటిసి హనుమంతు, మండల కన్వీనర్ బసన్న, మాజీ జెడ్పిటిసి తిప్పయ్య, రాష్ట్ర నాయకులు భరత్‌రెడ్డి, కరణం భీమిరెడ్డి, కొట్టాలపల్లి సర్పంచి లెజెండ్ మోదుపల్లి రామాంజనేయులు, మార్కెట్ యార్డు డైరెక్టర్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు చేస్తున్న మంచే మనల్ని నడిస్తుంది..

ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

ప్రజాశక్తి-శింగనమల

ప్రజలకి మనం మంచి చేస్తున్నామని, అదే మనల్ని ముందుకు నడిపించి గెలిపిస్తుందని ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి అన్నారు. ఆదివారం మండలంలోని నాగులగుడ్డం తండాలో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోవడంతోపాటు ప్రభుత్వ పథకాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను ప్రజలను నమ్ముతున్నానని, వారు ఉన్నంత కాలం కుట్రలు చేసేవారు ఏమీ చేయలేరన్నారు. పేదల నాలువేళ్లు నోటిలోకి వెళుతున్నాయంటే సిఎం జగనన్న అమలు చేస్తున్న పథకాలే కారణమన్నారు. ముఖ్యంగా అర్హులందరికీ పింఛన్లు, వివిధ వర్గాలకు రూ.10వేల చొప్పున ఖాతాల్లోకి జమ చేస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వాలు కేవలం ఇళ్లే ఇచ్చేవని, జగనన్న అధికారంలోకి వచ్చాక ఏకంగా కాలనీలనే నిర్మిస్తున్నారన్నారు. అలాగే పిల్లల చదువుల కోసం ఫీజు రీయింబర్స్‌మెంట్, అమ్మఒడి, జగనన్న దీవెన వంటి ఎన్నో పథకాలను అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రమంతా సస్యశ్యామలంగా ఉంటే కొంతమంది పచ్చ కళ్లతో చూసి విష ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. మీకు తెలుసు.. మీ మనసుకు తెలుసు.. ఓటు వేసేముందు అది ఒక్కటే ఆలోచించమని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి యువ నాయకుడు ఆలూరు ఎర్రిస్వామిరెడ్డి, మండల కన్వీనర్ పట్నం నగేష్, ఎంపిపి యోగేశ్వరి, జడ్పిటిసి సుధారెడ్డి, ఎంపిడిఒ నిర్మలాకుమారి, ఇఒఆర్‌డి శివనారాయణరెడ్డి, మల్లికార్జునరెడ్డి, బద్దూనాయక్, ఎన్‌వి.నారాయణ, భాస్కర్‌రెడ్డి, వైసిపి సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలికి కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి

నేరాలు ఘోరాలు

అశ్వర్థ నారాయణస్వామి బ్రహ్మోత్సవాల్లో విషాదం

పెన్నానదిలో మునిగి వ్యక్తి మృతి..మరొకరి పరిస్థితి విషయం

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

అశ్వర్థ నారాయణ స్వామి బ్రహ్మోత్సవాల్లో విషాదం చోటు చేసుకుంది. స్వామి దర్శనానికి వచ్చి పెన్నానదిలో స్నానం ఆచరిస్తుండగా నీటిలో కొట్టుకుపోయి వ్యక్తి మృతిచెందాడు. మరొకరిని స్థానికులు కాపాడి ఆసుపత్రికి తరలించారు. స్థానికుల వివరాల్లోకి వెళ్తే... కర్నూలు జిల్లా ప్యాపిలి మండలం రాచర్ల గ్రామానికి చెందిన వెంకటనారాయణ (40) కుటుంబంతో సహా అశ్వర్థానికి వచ్చారు. ఇందులో భాగంగా తన ఇద్దరు కొడుకులు, ఒక కూతురికి గుండు కొట్టించి స్నానానికి తీసుకెళ్లాడు. నీటిలో స్నానం చేస్తుండగా కొడుకు శ్రీనాథ్ నీటిలో కొట్టుకుపోయాడు. కాపాడేందుకు వెంకటనారాయణ కూడా నీటిలో కొట్టుకుపోయారు. గమణించిన స్థానికులు, పోలీసులు గమణించి వెంటనే ఇద్దరినీ బయటకు తీశారు. అయితే వెంటనే ఇద్దరినీ తాడిపత్రి ఆసుపత్రికి తరలించారు. అయితే వెంకటనారాయణ మార్గమధ్యంలోనే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కుమారుడు శ్రీనాథ్ చికిత్స పొందుతున్నాడు. సమాచారం అందుకున్న ఎస్ ఖాజాహుస్సేన్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వెంకటనారాయణ మృతదేహం వద్ద రోదిస్తున్న భార్యాపిల్లలు

భువనేశ్వరి అమ్మవారి ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర్‌రెడ్డి

భువనేశ్వరి అమ్మవారి ఆలయ నిర్మాణానికి భూమిపూజ

ఉరవకొండ : పట్టణంలోని కనేకల్లు రోడ్డులో నూతనంగా నిర్మించనున్న భువనేశ్వరి అమ్మవారి ఆలయ నిర్మాణానికి మాజీఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ఆదివారం భూమిపూజ చేశారు. ముందుగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం వేద మంత్రోచ్చరణల మధ్య ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా విశ్వ మాట్లాడుతూ భువనేశ్వరి అమ్మవారి ఆలయం నిర్మించాలని సంకల్పించడం అభినందనీయమన్నారు. అనంతరం శ్రీ పూర్ణానందస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంబిసి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ జోగి వెంకటేశులు, ప్రజాప్రతినిధులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, భువనేశ్వరీదేవి ఆలయ కమిటీ ఛైర్మన్ గవ్వల సోమశేఖర్, ప్రెసిడెంట్ నాగభూషణ, కోశాధికారి రమేష్, సభ్యులు ఓబన్న, రాఘవేంద్ర, బసవరాజు, రామాంజి, నరేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆయాల తొలగింపు ఆలోచనను విరమించుకోవాలి : సిఐటియు

గుంతకల్లు : పట్టణంలోని ప్రభుత్వ పాఠశాలల్లో గత 20 ఏళ్ల నుంచి అతి తక్కువ వేతనాలకు పని చేస్తున్న ఆయాలను తొలగించాలన్న ఆలోచనను వెంటనే విరమించుకోవాలని సిఐటియు పట్టణ అధ్యక్షుడు కసాపురం రమేష్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఆదివారం స్థానిక హంపిరెడ్డి భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 32 ప్రభుత్వ పాఠశాలల్లో దాదాపు 24 మంది ఆయాలు అతి తక్కువ జీతం తీసుకుంటూ పనిచేస్తున్నారన్నారు. అలాంటి వారిని విధుల నుండి తొలగిస్తామని ప్రధానోపాధ్యాయులు బెదిరించడం బాధాకరమన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సిఎం జగన్ చేసిన పాదయాత్రలో ఆయాలకు ఉద్యోగ భద్రతను కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. కావున సిఎం స్పందించి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో సిఐటియు పట్టణ ఉపాధ్యక్షుడు బి.తిమ్మప్ప, పాఠశాలల ఆయాలు పాల్గొన్నారు.

అంబేద్కర్ వర్సిటీ న్యాక్ అక్రిడిటేషన్‌కు సహకరించండి

ఉరవకొండ : పట్టణంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయానికి న్యాక్ అక్రిడిటేషన్ వచ్చేందుకు అధ్యాపక బృందంతోపాటు విద్యార్థులు సహకరించాలని యూనివర్సిటీ ఉరవకొండ అభ్యాసన కేంద్రం కోఆర్డినేటర్ హెచ్.శివశంకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యాక్ అక్రిడిటేషన్ అసైన్మెంట్‌లో భాగంగా యూనివర్సిటీ అందిస్తున్న సేవలపై అదే యూనివర్సిటీలో విద్యనభ్యసిస్తున్న విద్యార్థుల అభిప్రాయాలు తెలుసుకునేందుకు ప్రతి విద్యార్థికీ న్యాక్ నుంచి మెయిల్ వస్తుందన్నారు. కావున ప్రతి ఒక్కరూ తప్పకుండా వారి వ్యక్తిగత ఈమెయిల్‌ను చెక్ చేసుకుని వారు ఇచ్చే 20 ప్రశ్నలకు సరైన సమాధానాలను తిరిగి పంపాలని సూచించారు.

పలువురు వైసిపిలో చేరిక

పెద్దపప్పూరు : మండలంలోని తబ్జూల, సింగనగుట్టపల్లి గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి (బాబు), ఓబిరెడ్డి, సుబ్బారెడ్డి, రామచంద్ర, నరసింహులు కుటుంబాలతోపాటు మరో 100 కుటుంబాలు ఆదివారం వైసిపిలో చేరాయి. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలోకి చేరిన వారు మాట్లాడుతూ సిఎం జగన్ చేస్తున్న అభివృద్ధి, ప్రవేశపెడుతున్న పథకాలు, ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి చేస్తున్న సేవలను గుర్తించి వైసిపిలో చేరుతున్నట్లు తెలిపారు.

పార్టీలోకి చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే పెద్దారెడ్డి

ఎమ్మెల్యే పెద్దారెడ్డిపై దుష్ప్రచారం తగదు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

ఎమ్మెల్యే పెద్దారెడ్డిపై టిడిపి నాయకులు దుష్ప్రచారం తగదని మండల వైసిపి నాయకులు అన్నారు. ఆదివారం స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ పెద్దవడుగూరు మండలానికి ఎమ్మెల్యే పెద్దారెడ్డి చేసిన సేవలు గతంలో ఏ ఎమ్మెల్యే చేయలేదన్నారు. అలాంటి ఆయనపై కరపత్రాల ద్వారా విష ప్రచారం చేయడం బాధాకరమన్నారు. గూడూరు సూర్యనారాయణరెడ్డి, చిదంబరరెడ్డి, శరభరెడ్డి పదవులు ఇవ్వలేదని, దీంతో వారు అలిగారని కరపత్రాల్లో పేర్కొనడం బాధాకరమన్నారు. తమ పార్టీలో విభేదాలు పెట్టేందుకే ఇలాంటివి చేస్తున్నారన్నారు. తాడిపత్రి మార్కెట్ యార్డు ఛైర్మన్ పదవి వచ్చేందుకు హరినాథరెడ్డి ఎమ్మెల్యేకు ముడుపులు అందజేశారని కరపత్రికలో ముద్రించారన్నారు. ఏనాడు ఎమ్మెల్యేకు పైసా ఇవ్వలేద స్పష్టం చేశారు. తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జెసి ప్రభాకర్‌రెడ్డి ఏం మాట్లాడుతున్నాడో ఆయనకే అర్థం కావడం లేదన్నారు. ఇప్పటికైనా ఆయన వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. ఈ సమావేశంలో గూడూరు సూర్యనారాయణరెడ్డి, కన్వీనర్ శరబారెడ్డి, తాడిపత్రి మార్కెట్‌యార్డు ఛైర్మన్ హరినాథరెడ్డి, రామచంద్రారెడ్డి, నల్లపరెడ్డి, హరికృష్ణారెడ్డి, రామకృష్ణారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, రామ్‌భూపాల్‌రెడ్డి, గోపాల, తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

మెగావైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి-పుట్లూరు

మండలంలోని కడవకల్లు గ్రామంలో అమరావతి సూపర్ స్పెషాలిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరానికి మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన దాదాపు 800 మంది రోగులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వైద్యులు వారికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్సలు చేయించుకోవాలంటూ సూచించారు. కాగా అమరావతి ఆసుపత్రి ఎండి ముత్యాలప్పను సిపిఎం నాయకులు, స్థానికులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ముత్యాలప్ప మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో చాలామందికి వ్యాధులపై సరైన అవగాహన లేదన్నారు. అంతేగాకుండా ఏ రోగం ఆరోగ్యశ్రీ పథకానికి వర్తిస్తుందో ఇప్పటికీ ఎవరికీ తెలియదన్నారు. దీంతో పేదలు రూ.లక్షలు నష్టపోతున్నారన్నారు. ఈనేపథ్యంలో తాము వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి వ్యాధుల పట్ల అవగాహన కల్పించడంతోపాటు ఆరోగ్యశ్రీపై ప్రజల్లో చైతన్యం తెస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు రామాంజి, సూరి, వెంకటచౌదరి, పూలరంగడు, భాస్కర్‌రెడ్డి, నాగభూషణ, నారాయణస్వామి, వీరయ్య, సర్పంచి రామాంజనేయులు, ఆసుపత్రికి చెందిన వైద్యులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రోగులకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఎస్సీ, ఎస్టీ రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమానికి కృషి

అనంతపురం రెవెన్యూ ఉద్యోగుల కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-అనంతపురం

ఎస్సీ, ఎస్టీ రెవెన్యూ ఉద్యోగుల సంక్షేమానికి పాటుపడుతామని ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గిరీష్ మొలతాటి తెలిపారు. ఈమేరకు ఆదివారం గుంటూరు పెన్షనర్స్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అనంతపురం రెవెన్యూ ఉద్యోగుల అసోసియేషన్ కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ ఉద్యోగుల జోలికి వస్తే సహించబోమని స్పష్టం చేశారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చిట్టి బాబు, అసోసియేట్ అధ్యక్షులు గార మధుసూదన్‌రావు, రాష్ట్ర ఉపాధ్యక్షులుగా గుజ్జల దేవరాజ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా చాట్ల అజయ్‌కుమార్, జ్యోత్స్న, లక్ష్మీ, సుందర్‌రావు, నరేష్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ఎపిఆర్ఎస్‌సిఎస్‌టిఇఎస్ఎ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.ఎ. కిరణ్‌కుమార్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులను దుశ్శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కాయల సతీష్‌కుమార్, తూము వెంకటేశ్వరరావు, నెల్లూరు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.అశోక్‌కుమార్, గుంటూరు జిల్లా కార్యవర్గ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర నాయకులను సన్మానిస్తున్న ఉద్యోగులు

రైతుసేవలో భాగస్వాములు అవుదాం..

జై కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు నాగమల్లి ఓబులేసు

ప్రజాశక్తి-ఉరవకొండ

ప్రతి ఒక్కరూ రైతు సేవలో భాగస్వాములై వారి అభివృద్ధికి చేయూతనిద్దామని జై కిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు నాగమల్లి ఓబులేసు పిలుపునిచ్చారు. ఆదివారం పలువరు రైతులను ప్రత్యక్షంగా కలుసుకుని వారి అనుభవాలు తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు రాత్రనకా, పగలనకా వారు కష్టపడి మానవాళికి ఆరోగ్యాన్నిచ్చే ఉపయోగకరమైన ఆహార పదార్థాలను పండిస్తున్నారని కొనియాడారు. ముఖ్యంగా ఉరవకొండ నియోజకవర్గంలోని వజ్రకరూరు మండలం తట్రకల్, గంజిగుంట గ్రామాల్లో సుమారు 200 ఎకరాల్లో చెరకు, కొబ్బరి బోండాలు సాగు చేస్తున్నారన్నారు. కావున ప్రతి ఒక్కరూ తమ శుభకార్యాల్లో చెరకు రసం, కొబ్బరి బోండాలను అందించి వారి అభివృద్ధికి తోడ్పాటునివ్వాలని పిలుపునిచ్చారు. ముఖ్యంగా మాఘమాసంలో పెళ్లిళ్లతోపాటు శుభకార్యాలు జరిగే సీజన్ కావటం వల్ల చెరకు రసం, కొబ్బరి బోండాలు పంపిణీ చేసేందుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

చెరకు రైతులతో మాట్లాడుతున్న జైకిసాన్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు ఓబులేసు

నేటి నుంచి షిరిడీ సాయి మందిర ప్రారంభోత్సవాలు

ప్రజాశక్తి-పెద్దవడుగూరు

మండల కేంద్రంలో వెలసిన షిరిడీ సాయి మందిరంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఐదురోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యుడు, తాడిపత్రి మార్కెట్‌యార్డు ఛైర్మన్ హరినాథరెడ్డి తెలిపారు. సుమారు రూ.5 కోట్లతో నిర్మించిన ఆలయం భక్తులను ఆకర్షిస్తోంది. ఇందులో భాగంగా నేడు గోపూజ, గణపతి పూజ, యాగ మండప ప్రవేశం, నవగ్రహ ఆరాధన, 31న ప్రాతకాలపూజలు, వేదపారాయణం, యంత్ర, విగ్రహ అభిషేకాలు, గణపతి హోమం, 1న ప్రాత:కాల పూజలు, మహాసుదర్శన హోమం, బాబా విగ్రహం గ్రామోత్సవం, 2న చండీహోమం, ప్రతిష్ట మూర్తుల మూలమంత్ర క్షీరతర్పణం, 3న షిరిడీ సాయిబాబా, దత్తాత్రేయ, లక్ష్మీ, ఆంజనేయస్వామి విగ్రహాలను ప్రతిష్టించనున్నట్లు తెలిపారు.

విద్యుత్ కాంతుల వెలుగులో షిరిడీసాయి మందిరం

అశ్వర్థానికి పోటెత్తిన భక్తులు

ప్రజాశక్తి-పెద్దపప్పూరు

మండల కేంద్రంలో సమీపంలో వెలసిన అశ్వర్థానికి భక్తులు పోటెత్తారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ ఆదివారాన్ని పురస్కరించుకుని భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఉత్తర, దక్షిణం ప్రవహించే పెన్నానదిలో స్నానమాచరించి అశ్వర్థ నారాయణస్వామిని దర్శించుకున్నారు. శనివారం సాయంత్రం నుంచే అశ్వర్థం క్షేత్రానికి భక్తుల తాకిడి మొదలైంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఆలయ ఈవో సుబ్రహ్మణ్యం ఛైర్మన్ శ్రీనివాసులురెడ్డి ఏర్పాట్లు చేశారు. ఆర్టీసీ అధికారులు అటు తాడిపత్రి, ఇటు అనంతపురం నుంచి ప్రత్యేక బస్సులు నడిపారు.

పూజలందుకున్న స్వామివారు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుల పాఠశాలలో 1990లో 10వ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం స్థానిక పాఠశాల ఆవరణలో ఆదివారం కలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు చదివేటప్పుడు ఉన్న ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. అనంతరం అలనాటి పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. అనంతరం అందరూ కలిసి అక్కడే మధ్యాహ్నం భోజనం చేసి సాయంత్రం వరకు ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల లక్ష్మీనారాయణ, హరిప్రసాద్, గుత్తి విజయకుమార్, కరుణాకర్, మధుసూదన్, శ్రీనివాసులు, డేవిడ్, గూడపు రెడ్డి, నాగభూషణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేడు వాహనాలకు వేలంపాట

పుట్లూరు : వివిధ ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడి మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఉన్న వాహనాలకు సోమవారం వేలపాట నిర్వహించనున్నట్లు ఎస్ఐ వెంకటప్రసాద్ తెలిపారు. 8 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వేలం వేయనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు వేలంలో పాల్గొనాలని కోరారు.

శాతవాహన పరిశ్రమలో 12 గంటల పని ఆపాలి

ప్రజాశక్తి-బొమ్మనహాల్

మండలంలోని శాతవాహన కర్మాగారంలో పనిచేస్తున్న కార్మికులకు 8 గంటల విధులను వెంటనే ఆపాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ కర్మాగారంలో కార్మిక చట్టాలను అమలు చేయాలన్నారు. ముఖ్యంగా 8 గంటల పని విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రెగ్యులర్ ఉద్యోగులు కాకుండా కాంట్రాక్ట్ పద్ధతుల్లోనే పనిచేయించుకోవడం, సరైన వసతి, ఆహారం, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు ఓబులేసు, బసవరాజు, రాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-అనంతపురం

నగరంలోని డాక్టర్ కెఎస్ఎ ఆర్.గఫూర్ ఆసుపత్రి డాక్టర్లు అబ్దుల్ రజాక్ గఫూర్, ఆర్షద్ ఆయూబ్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని రాజీవ్‌కాలనీలో ఉన్న పంచాయతీ కార్యాలయంలో ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. సిఆర్‌డి మహాత్మాగాంధీ రెయిన్‌బో, లర్నింట్ సెంటర్ల సహకారంతో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో దాదాపు 200 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచి ఆశాబీ మాట్లాడుతూ పేదలకు ఉచితంగా వైద్యం చేస్తున్న డాక్టర్లు రజాక్‌గఫూర్, అర్షద్‌ఆయూక్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పేదలకు ఎప్పుడూ వారు మందుంటారని కొనియాడారు. డాక్టర్ గఫూర్ మాట్లాడుతూ పేదలకు వైద్యసేవలు అందించడంలో తాను ముందు వరుసలో ఉంటానన్నారు. అంతేగాకుండా మనం సంపాదించిన వాటిలో కొంతమేర పేదలకు ఖర్చు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్.సద్దాంబాషా, సిఆర్‌డిఒ వ్యవస్థాపకులు మల్లియాదవ్, సిస్టర్స్ ఆయేషా, శ్రీలత, మేఘనా, కీర్తి, రూపశ్రీ, సుదర్శన్‌రెడ్డి, మహమ్మద్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

బెలుగుప్ప : ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనడంతో వ్యక్తికి తీవ్ర గాయాలైన ఘటన మండల పరిధిలోని అనిమరెడ్డిపల్లి గ్రామ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని విరుపాపల్లి గ్రామానికి చెందిన రామాంజనేయులు ద్విచక్ర వాహనంలో సొంత పని ముగించుకుని స్వగ్రామానికి వస్తుండగా అనిమిరెడ్డిపల్లి గ్రామ సమీపంలోని రాగానే కళ్యాణదుర్గం నుంచి అనంతపురం వెళ్తున్న లారీ ఢీకొంది. దీంతో తీవ్రంగా గాయపడిన రామాంజనేయును 108 సాయంతో చికిత్స కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బెలుగుప్ప ఎస్ఐ రామకృష్ణయ్య కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గాయపడిన రామాంజనేయులు

చౌకబియ్యం పట్టివేత

బెలుగుప్ప : మండల పరిధిలోని గుండ్లపల్లి క్రాస్ దగ్గర రెవెన్యూ అధికారులు, ఎస్ఐ రామకృష్ణయ్య సమక్షంలో చౌకబియ్యాన్ని పట్టుకున్నారు. అధికారులు తెలిసిన వివరాల మేరకు.. వాహనాల తనిఖీలో భాగంగా బందోబస్తు నిర్వహిస్తుండగా శెట్టూరు మండలం మాలేపల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ రామాంజనేయులు ఆటోలో అక్రమంగా తరలిస్తున్న ఆరు క్వింటాళ్ల రేషన్ బియ్యంతోపాటు ఆటో, డ్రైవర్ రామాంజనేయులు అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళకు తోపుడు బండి అందజేత

తాడిపత్రిరూరల్ : ఉద్యోగ, ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఓ మహిళకు ఆదివారం తోపుడు బండిని విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని విజయలక్ష్మి థియేటర్ దగ్గర ఉన్న పేద ముస్లిం జహరాబి అనే మహిళ తోపుడు బండిపై పండ్ల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేదన్నారు. అయితే ఆమె తోపుడు బండి పూర్తిగా పాడైపోయి వ్యాపారం చేసుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతోందన్నారు. విషయం తెలుసుకున్నఉద్యోగ ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ తాడిపత్రి శాఖ సభ్యులు రూ.12 వేల విలువజేసే తోపుడు బండిని జహరాబికి అందజేశారు. దీంతో ఆమె ఉద్యోగ, ఉపాధ్యాయ సేవాసంస్థకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగ, ఉపాధ్యాయ సామాజిక సేవాసంస్థ అధ్యక్షులు శ్రీహరి, నారబోయిన శంకర్, చెన్నకేశవులు, శ్రీరంగయ్య, నాగభూషణరావు, శ్రీనివాసులు, వెంకట శివారెడ్డి, ఓబులేష్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

మహిళకు తోపుడు బండి అందజేస్తున్న ఉద్యోగ, ఉపాధ్యా సామాజిక సేవాసంస్థ సభ్యులు

వట్టి వసంతకుమార్ మృతి బాధాకరం

ఉరవకొండ : మాజీ మంత్రి, సీనియర్ రాజకీయ నాయకులు పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన వట్టి వసంతకుమార్ మృతిచెందడం బాధాకరమని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తీవ్ర దిగ్భ్రాంతికి లోనయ్యారు. ఈ సందర్భంగా ఆయనతో తనకున్న సాన్నిహిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. ముఖ్యంగా వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, రోశయ్య, కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వాల్లో మంత్రిగా పనిచేసి తనకెంతో స్నేహంగా ఉండేవాడన్నారు. అందరితో కలిసిమెలిసి పని చేసేవారమని, నిత్యం ప్రజలకు ఎంతో సేవ చేయాలని తపనపడే వారన్నారు. అలాంటి వ్యక్తి మృతి తీరనిలోటని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయనకు దేవుడు ఆత్మశాంతిని కలిగించి కుటుంబ సభ్యులకు భరోసా కల్పించాలని కోరారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుదాం

ఉరవకొండ : మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడదామని నవాబ్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు పిలుపునిచ్చారు. ఆదివారం సవాబ్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో పాక్ దామన్ హజరత్ బీబీ జైనా బీ దర్గా ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షులు మాట్లాడుతూ మొక్కలే జీవకోటికి ప్రాణాధారమన్నారు. ప్రపంచ మానవాళికి ఆక్సిజన్ ఎంతో అవసరమన్నారు. ప్రతి మనిషి, జీవరాసులు బతకాలంటే చెట్ల ద్వారా వచ్చే ఆక్సిజన్ చాలా అవసరమన్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో పర్యావరణం చాలా కాలుష్యమైందన్నారు. రోడ్ల వెడల్పులో భాగంగా ఎక్కడికక్కడ చెట్లను కొట్టివేస్తున్నారన్నారు. దీంతో పర్యావరణం కలుషితం అవుతోందన్నారు. కావున ప్రజలందరూ తమ ఇళ్లు, ఆలయాలు, మసీదులు, చర్చల దగ్గర మొక్కలను నాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి వన్నూర్ సాహెబ్, రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ సభ్యుడు మీరాం బాషా, బీసీ యువజన సంఘం ఉపాధ్యక్షులు హనీఫ్, మైనార్టీ నాయకులు రహంతుల్లా, జబ్బార్, కళ్యాణదుర్గం నూర్‌బాషా, జాకీర్ బాషా, పామిడి నూర్, మెడికల్ స్టోర్ జిలాన్, కొత్త రవి, నబిరసూల్, అక్రమ్,అజీజ్, గుణ, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు పంపిణీ చేస్తున నవాబ్ స్వచ్ఛంద సేవాసంస్థ ప్రతినిధులు